PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 180 | 14 బుధవారం అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

# ఏపీ స్థానిక సమరం...

## కూటమిలో సీట్ల సర్దుబాటుపై తీవ్ర కసరత్తు.. నేడే ఫైనల్!

- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల వేళ ఎన్డీయేలో జోరందుకున్న సీట్ల పంపకాల చర్చలు
- ముందుగా జనసేనతో డీల్ ఖరారు చేసి, ఆపై బీజేపీతో చర్చించాలని చంద్రబాబు నిర్ణయం
- తమ త్యాగాలకు గుర్తింపుగా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరిన పవన్
- మంగళవారం రాత్రి సీఎం నివాసంలో టీడీపీ, జనసేన నేతల తుది భేటీ
- అక్టోబర్ 14న నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో చర్చల్లో పెరిగిన వే



ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై మంతనాలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం నాడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య చర్చలు తారాస్థాయికి చేరాయి. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అక్టోబర్ 14న ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చన్న అంచనాల నేపథ్యంలో, ఆ లోపే పంపకాలను పూర్తి చేసి ఐక్యంగా బరిలోకి దిగాలని కూటమి భావిస్తోంది. ...మిగతా 2 లో...

# సొంత పార్టీ సీఎంకు రాహుల్ గాంధీ ఇచ్చే గౌరవం ఇదేనా?.. డీకే తోపులాటపై బీజేపీ సెటైర్లు!

- ఢిల్లీ నిరసనలో సీఎం శివకుమార్‌కు ఎదురైన తోపులాట
- రాహుల్ భద్రతా సిబ్బంది ఆయనను పక్కకు నెట్టినట్లు ఆరోపణలు
- ఘటనపై కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రశ్నించిన బీజేపీ
- అధిష్ఠానం వద్ద శివకుమార్‌కు గౌరవం ఉందా? అని ప్రశ్న
- భద్రతా విధుల్లో భాగంగానే తోపులాట జరిగిందని పరమేశ్వర వివరణ

ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన ర్యాలీలో కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌కు ఎదురైన చేదు అనుభవంపై బీజేపీ విమర్శలు గుప్పించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భద్రతా సిబ్బంది శివకుమార్‌ను పక్కకు నెట్టిన ఘటనను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నాయకత్వంపై ప్రశ్నలు సంధించింది. సొంత పార్టీ ముఖ్యమంత్రికే ఆ పార్టీలో గౌరవం దక్కడం లేదని ఎద్దేవా చేసింది. బీజేపీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఈ ఘటనకు సంబంధించిన వీడియోను పోస్టు చేసింది.

...మిగతా 2 లో...



# 13వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పుల్లంపేటలో అంగరంగ వైభవంగా ప్రారంభం...

మిగతా 2 లో



**- కడప జిల్లా క్రీడలకు పుట్టినిల్లు - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆముదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్**









**పుల్లంపేట:**

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఎస్.డి.వి.డి. సభ స్కూల్ గ్రౌండ్స్ నందు 13వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్బాల్ టోర్నమెంట్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ సాఫ్ట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరై టోర్నమెంట్ను ప్రారంభించారు. గౌరవ అతిథిగా స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ, "క్రీడలంటేనే ఆరోగ్యానికి చిరునామా. సాఫ్ట్బాల్ క్రీడ అంటే కడప జిల్లాలో పుల్లంపేట గుర్తొస్తుంది. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సాఫ్ట్బాల్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సెక్రెటరీ రామ సుబ్బారెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కడప జిల్లా అని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చేలా ఈ క్రీడలు నిర్వహించినందుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు."సాంస్కృతిక విభాగం అధ్యక్షులు నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ, "క్రీడలలో ప్రతిభ కనబరుస్తూ ఉన్న స్థాయికి ఎదగాలి. క్రీడల్లో ఎంతో భవిష్యత్తు ఉంది. క్రీడలంటే ఆరోగ్యానికి మొదటి మెట్టు." అని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా సెక్రెటరీ రామసుబ్బారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఏపీ ఏపీ సాఫ్ట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆల్ఫా మెరిన్ వ్యవస్థాపకురాలు దూడల మాధవి, వారు మాట్లాడుతూ క్రీడలతోనే భవిష్యత్తు ఉంటుందని ప్రతి పనిలో అడ్డంకులు ఎదురవుతాయని ధైర్యంగా ముందుకు సాగాలని క్రీడాకారులకు స్ఫూర్తి నింపారు.

# నిరసనకారులను విడదీసే కుట్ర.. కేంద్రంపై అభిజిత్ దీప్కే తీవ్ర ఆరోపణలు

- నిరసనల విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపణ
- ఉద్యమకారుల మధ్య అనుమానాలు సృష్టించి విడదీసే ప్రయత్నం
- తమ నిరసనపై ఉక్కుపాదం, ఇండియా కూటమి ర్యాలీకి అనుమతిపై విమర్శ
- కుట్ర సిద్ధాంతాలను నమ్మకుండా ఐక్యంగా ఉండాలని ఉద్యమకారుల పిలుపు
- అసలు పోరాటం జ్ఞానేశ్ కుమార్, ఆయనను కాపాడుతున్న వారిపైనేనని స్పష్టీకరణ

కేంద్ర ప్రభుత్వం నిరసనకారుల మధ్య విభేదాలు సృష్టించి, వారి ఐక్యతను దెబ్బతీసేందుకు 'విభజించి పాలించు' అనే కుట్రపూరిత వ్యూహాన్ని అమలు చేస్తోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆరోపించారు.

...మిగతా 2 లో...

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

- కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ
- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి



దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్ఠను మంటగలుపుతున్నారని విమర్శించారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా

# అంగరంగ వైభవంగా ప్రారంభం.

మొదటిపేజీ తరువాయి

**సాఫ్ట్బాల్ క్రీడ మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారు చేస్తుంది: కూన రవికుమార్**

ముఖ్య అతిథి కూన రవికుమార్ మాట్లాడుతూ, "సాఫ్ట్బాల్ క్రీడ మానసికంగా తయారు చేసేది, దృఢంగా తయారు చేసేది. ఎంతమంది ఈ ఆటను కించపరచాలని చూసినా కూడా గర్వంగా నిలబడి చాటి చెప్పిన క్రీడ ఈ సాఫ్ట్బాల్ క్రీడ." అని సగర్వంగా తెలియజేశారు."ఈ రాష్ట్రంలో ప్రతిపక్షం సాఫ్ట్బాల్ క్రీడపై అవాకులు చివాకులు పేలిన సాఫ్ట్బాల్ అంటే ఏమిటో తెలియజేసిన ఈ కడప జిల్లా జరుగుతున్న క్రీడలే సాక్ష్యం. కడప జిల్లా అంటే క్రీడలకు పుట్టినిల్లు. ఈ విషయం తెలియని జగన్మోహన్ రెడ్డి అవాకులు చివాకులు పేలుతున్నాడు. క్రీడలంటే తెలియని వ్యక్తికి ఈ సాఫ్ట్బాల్ గురించి, ఈ టోర్నీ గురించి ఏమి తెలుసు? క్రీడలు ఆడే వారికే తెలుస్తుంది." అని ఆయన తెలియజేశారు."సాఫ్ట్బాల్ రంగంలో డీఎస్సీలో మన రాష్ట్ర క్రీడాకారులు కష్టపడి సాధించిన మెడల్స్ను దొంగ సర్టిఫికెట్లు అంటూ అవాకులు చివాకులు తేలుతున్న ఈ ప్రతిపక్షానికి కడప జిల్లా ప్రజలే బుద్ధి చెప్పాలి. ఈ జిల్లాలో సాఫ్ట్బాల్ రంగంలోనే డీఎస్సీలో 38 పోస్టులు సాధించారు. ఈ సాఫ్ట్బాల్ రంగం అంటే ఎంతో ఉన్నతమైంది. ఇలాంటి ఉద్యోగాలు సాధించడంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థులు, వారి కష్టాన్ని గుర్తించాలి, అవహేళన చేయకూడదు." అని జగన్మోహన్ రెడ్డికి మరోసారి తెలియజేస్తున్నానని ఆయన అన్నారు."సాఫ్ట్బాల్ రంగాన్ని రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లి ఆంధ్రప్రదేశ్ అంటే ఏమిటో నిరూపిస్తాము. ఈ క్రీడలను కడప జిల్లాలో నిర్వహించడం ఎంతో గర్వకారణం." అని కూన రవికుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొని వారి విలువైన సూచనలు తెలియజేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ చేతుల మీదగా15 జిల్లాల జట్లకు 65 వేల విలువ గల క్రీడా సామాగ్రి వారు అందజేశారు.

**మొదటి రోజు పోటీలు**

15 జిల్లాల లీక్ దశ పోటీలు బాలుర 21 జట్లు పాల్గొనగా 16 మ్యాచులు పూర్తయ్యాయి .బాలికల జట్ల లీగ్ దశలు జరిగాయి. బాలికల 21 మ్యాచ్లకు గాను 9 మ్యాచులు పూర్తయ్యాయి. మిగిలిన మ్యాచులు రేపు నిర్వహిస్తామని నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ టెక్నికల్ ఇంచార్జ్ ఏ ఎస్ ఎస్ జగదీశ్వర్ రెడ్డి తెలియజేశారు. 15 జిల్లాల నుంచి 300 మంది బాలురు, 300 మంది బాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ట్రెజరర్ శివకుమార్ టిడిపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు, ఎస్బి వీ డి సభ స్కూల్ కరస్పాండెంట్ నూకల శ్రీరాములు డాక్టర్ చలమయ్య .నారాయణ నాయుడు వెంకటసుబ్బయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారికి మెమెంటోలు అందజేశారు. పుల్లంపేట ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని క్రీడలను వీక్షించారు.

# నిరసనకారులను విడదీసే కుట్ర.. కేంద్రంపై అభిజిత్ దీప్కే తీవ్ర ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నియామకానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాన్ని నీరుగార్చేందుకు, వివిధ నిరసన బృందాల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ వారి మధ్య అపనమ్మకాన్ని, అనుమానాలను రేకెత్తిస్తోందని ఆయన విమర్శించారు.గతంలో సీజేపీ నిరసనకు అనుమతి లభించినప్పుడు, కొందరు తమను బీజేపీ అనుకూల వ్యక్తులుగా చిత్రీకరిస్తూ కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేశారని ఆయన గుర్తు చేశారు. నిన్న ఇండియా కూటమి భారీ నిరసన చేపట్టిన నేపథ్యంలో, అక్టోబర్ 10న తమపై ప్రయోగించిన ఉక్కుపాదాన్ని ప్రభుత్వం వారిపై ప్రయోగించలేదని ఆయన వివరించారు. "ప్రజలను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పడమే ఈ ప్రభుత్వ విధానం. ఒక నిరసనను అనుమతించి, మరొకదాన్ని అణిచివేయడం ద్వారా ఒకే లక్ష్యం కోసం పోరాడుతున్న వర్గాల మధ్య అనుమానాలకు ఆస్కారం కల్పిస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కుట్రపూరిత వ్యూహం వెనుక ఉన్న అంతరార్థాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలని అభిజిత్ దీప్కే కోరారు. "నేడు ఒకరికి అనుమతినిచ్చి, మరొకరిని అణిచివేస్తే ప్రభుత్వం, రేపు దానికి భిన్నంగా వ్యవహరించవచ్చు. అధికారాన్ని ప్రశ్నించడం మానేసి, నిరసనకారులు తమలో తామే కలహించుకునేలా చేయడమే పాలకుల అంతిమ లక్ష్యం" అని ఆయన విశ్లేషించారు. తప్పుడు ప్రచారాలను, కుట్ర సిద్ధాంతాలను నమ్మి విడిపోవద్దని, అంతర్గత విభేదాల ఉచ్చులో పడవద్దని ఆయన ప్రజలకు, వివిధ నిరసన బృందాలకు విజ్ఞప్తి చేశారు. "మనమంతా ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. మన పోరాటం జ్ఞానేశ్ కుమార్ నియామకంపై, ఆయనను వెనకేసుకొస్తున్న వ్యవస్థపైనే అన్న విషయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ విస్మరించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు.

# సొంత పార్టీ సీఎంకు రాహుల్ గాంధీ ఇచ్చే గౌరవం ఇదేనా?.. డీకే తోపులాటపై బీజేపీ సెటైర్లు!

మొదటిపేజీ తరువాయి

నిరసనలో పాల్గొనేందుకు వచ్చిన శివకుమార్.. కెటిల్ నుంచి వెలువడిన ఆవిరిలా మాయమయ్యారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. ముఖ్యమంత్రికి రాహుల్ గాంధీ ఇచ్చే గౌరవం ఇదేనా? మర్యాద లేదు.. పట్టింపు లేదు.. కాంగ్రెస్ శైలిలో అవమానించడమేనని విమర్శించింది. కన్నడిగుల ఆత్మగౌరవం ఎక్కడ? కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బీవై విజయేంద్ర కూడా ఈ ఘటనపై స్పందించారు. రాష్ట్రంలో ఏమైనా మాట్లాడుకోవచ్చని, కానీ పార్టీ అధిష్ఠానం వద్ద ఎంత గౌరవం దక్కుతుందో ప్రపంచానికే తెలుసంటూ శివకుమార్ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి శివకుమార్ ఎంత అవసరమో తమకు సంబంధం లేదన్నారు. అయితే ముఖ్యమంత్రి పదవిలో ఉన్న కన్నడిగుడికి అవమానం జరిగితే అది కన్నడిగుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ఈ విషయంలో అధిష్ఠానానికి తన ఆత్మగౌరవం గురించి చెప్పే ధైర్యం శివకుమార్కు ఉందా? అని ప్రశ్నించారు. భద్రతా విధుల్లో భాగమే: పరమేశ్వర మరోవైపు, ఈ ఘటనపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి జి.పరమేశ్వర స్పందించారు. నిరసనలు, భారీ జనసమూహాల సమయంలో భద్రతా ఏర్పాట్లను నిర్వహించడం కష్టమని చెప్పారు. గతంలో తాను పాల్గొన్న నిరసనల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయని తెలిపారు. రాహుల్ గాంధీ భద్రత చూసే సిబ్బందికి ఆయనకు రక్షణ కల్పించడమే ప్రధాన బాధ్యతని పరమేశ్వర వివరించారు. అనుమతి లేని వ్యక్తులు ఆయన వద్దకు రాకుండా చూడటం భద్రతా విధానంలో భాగమన్నారు. అదే సమయంలో సీఎం శివకుమార్ అక్కడికి రావడంతో జనసందోహంలో ఆయనను కొంతమేర పక్కకు నెట్టారని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రోటోకాల్ ప్రకారం ప్రత్యేక గౌరవం ఉన్నప్పటికీ, భద్రతా సిబ్బంది తాము రక్షించాల్సిన వ్యక్తి భద్రతకే ప్రాధాన్యమిస్తారని స్పష్టం చేశారు.

# స్థానిక పోరుకు సిద్ధమవుతున్న ఏపీ.. గెజిట్ రాగానే షెడ్యూల్ ప్రకటిస్తాం: ఎస్ఈసీ పునేఠా

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల

గెజిట్ నోటిఫికేషన్ల తర్వాతే ప్రకటన అంటున్న ఎస్ఈసీ పునేఠా

50 శాతం పరిమితికి లోబడే రిజర్వేషన్లను ఖరారు చేసిన ప్రభుత్వం

బీసీలకు 34 శాతం కోటా పెంపు ఉత్తర్వులను కొట్టివేసిన హైకోర్టు

ప్రభుత్వ పిటిషన్ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. సంబంధిత ప్రభుత్వ శాఖలు గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా మంగళవారం స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం తమ సంసిద్ధతను తెలియజేసిన తర్వాత ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళతామని ఆయన తెలిపారు. నేడు ఆయన 20 రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించారు.సమావేశం అనంతరం పునేఠా మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సున్నితమైన, అత్యంత సున్నితమైన ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోటీ చేసే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని రాజకీయ పార్టీలు కోరినట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయడంతో సహా పలు కీలక సూచనలను పార్టీల ప్రతినిధులు తమకు అందజేశారని పునేఠా వివరించారు. 50% కోటాకు లోబడే రిజర్వేషన్లు రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఛైర్పర్సన్ పదవులకు ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ రిజర్వేషన్ల కేటాయింపులో భాగంగా మంగళగిరి–తాడేపల్లి మేయర్ పదవిని ఎస్టీకి, కర్నూలు (మహిళ), రాజమహేంద్రవరం (జనరల్) పదవులను ఎస్సీలకు కేటాయించారు. కాకినాడ (మహిళ), మచిలీపట్నం (మహిళ), ఏలూరు (జనరల్), అనంతపురం (జనరల్), చిత్తూరు (జనరల్) మేయర్ స్థానాలను బీసీలకు రిజర్వ్ చేశారు. విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ పదవులను మహిళా (జనరల్) కేటగిరీ కింద రిజర్వ్ చేశారు. తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు మేయర్ స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా మిగిలాయి. రాష్ట్రంలోని 13 ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళలకు సీట్ల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ మున్సిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్ పి. సంపత్ కుమార్ అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. కోర్టు తీర్పులతో మారిన సమీకరణాలు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేయడంతో, మొత్తం రిజర్వేషన్లను 50 శాతానికే పరిమితం చేయాల్సి వచ్చింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని హైకోర్టు అక్టోబర్ 1న ఇచ్చిన తీర్పులో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా ప్రభుత్వానికి నిరాశే ఎదురైంది. అక్టోబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బీసీ కోటాను పెంచడానికి ప్రభుత్వం ఆధారపడిన డేటా, ముఖ్యంగా 'యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే'పై అత్యున్నత న్యాయస్థానం సందేహాలు వ్యక్తం చేసింది.2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 34 శాతానికి పెంచుతామని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కీలక హామీ ఇచ్చింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఆగస్టు 18న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే, కోర్టు తీర్పుల నేపథ్యంలో ఈ హామీ అమలుకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం 50 శాతం పరిమితికి లోబడే ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయడంతో, ఎన్నికల నిర్వహణకు అడ్డంకులు తొలగిపోయాయి. ఎస్ఈసీ అధికారిక ప్రకటన కోసం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఏపీ స్థానిక సమరం...

మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలో భాగంగా నేడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. రెండు రోజుల్లో వీరి మధ్య ఇది రెండో దఫా చర్చలు కావడం గమనార్హం. అయితే, బీజేపీతో చర్చలను కొలిక్కితెచ్చే ముందు, జనసేనకు కేటాయించాల్సిన సీట్లపై ఒక స్పష్టతకు రావాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం, పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడు నేరుగా జనసేన కార్యాలయానికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.తాజా సమాచారం ప్రకారం, మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో టీడీపీ, జనసేన నేతలు మరోసారి భేటీ కానున్నారు. ఈ సమావేశంలోనే సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన నగరపాలక సంస్థల మేయర్ అభ్యర్థుల ఎంపికపైనా ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన, బీజేపీలు తమ బలాబలాల ఆధారంగా ఆశిస్తున్న స్థానాల జాబితాను చంద్రబాబుకు అందజేశాయి. పార్టీల గెలుపు అవకాశాలను బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత వారం కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య సీట్ల పంపకాలు, ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.ఈ చర్చల నేపథ్యంలో, అక్టోబర్ 11న పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి ఏర్పాటు, విజయం కోసం జనసేన, జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ త్యాగాలకు గుర్తింపుగా మిత్రధర్మాన్ని అనుసరించి స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. "2024 ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడాం. ఇప్పుడు జరగబోయే స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని ఆశిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. 2014లో కూడా జనసైనికులు త్యాగాలు చేశారని పవన్ తెలిపారు. "2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఒక్క జనసైనికుడు కూడా పదవి ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని నిస్వార్థంగా పనిచేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ కోసం, కూటమి కోసం ఎన్నో త్యాగాలు చేశారు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా, స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులకు న్యాయం జరగాలనే సంకేతాన్ని పవన్ బలంగా పంపారు. దీంతో సర్దుబాటు ప్రక్రియలో జనసేన డిమాండ్లకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# గొల్లప్రోలు మున్సిపల్ పీఠంపై 'జనసేన' జెండా?

## కూటమి రేసులో దూసుకుపోతున్న విద్యావేత్త 'కడారి తమ్మయ్య నాయుడు'!




గొల్లప్రోలు : (ప్రజా సీమ )

గొల్లప్రోలు మున్సిపల్ చైర్మన్ పీఠంపై రాజకీయ ఉత్కంఠ క్లైమాక్స్కు చేరింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై ముమ్మరంగా చర్చలు సాగుతున్న వేళ, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్య నాయుడు పేరు చైర్మన్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. 2014లో పార్టీ స్థాపించిన నాటి నుండి జనసేనతోనే కొనసాగుతూ, పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న ఆయనకు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో భారీ మద్దతు లభిస్తోంది.పవన్ కళ్యాణ్తో సాన్నిహిత్యం.. తిరుగులేని విధేయత!జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్తో తమ్మయ్య నాయుడికి ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుబంధం, సాన్నిహిత్యం ఇప్పుడు స్థానికంగా ప్లస్ పాయింట్గా మారాయి. పిఠాపురం నియోజకవర్గ పర్యటనల సందర్భంగా పవన్ కళ్యాణ్ స్వయంగా తమ్మయ్య నాయుడు నివాసంలోనే బస చేయడం ఆయనకున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోందని అనుచరులు గుర్తుచేస్తున్నారు. కిందిస్థాయి కార్యకర్తలతోనూ, స్థానిక నాయకులతోనూ ఆయనకున్న సత్సంబంధాలు ఈ రేసులో ఆయనను ముందంజలో నిలిపాయి.

# మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆకుల నరసన్న పటేల్

(ప్రజా సీమ )

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సేవలు, వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సమావేశంలో చర్చించారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ షర్మిల, తహసీల్దార్ నర్సింగరావు, ఎంపీడీవో అశోక్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

# గొల్లప్రోలులో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు!

## అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు.. భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు





గొల్లప్రోలు :(ప్రజా సీమ )

పట్టణంలోని కర్ణం గారి తోటలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా బోనాల కార్యక్రమం నిలిచింది. మహిళలు సంప్రదాయబద్ధంగా తలపై బోనాలు ధరించి అమ్మవారిని స్మరిస్తూ భక్తిపారవశ్యంతో ఊరేగింపులో పాల్గొన్నారు. గొల్లప్రోలు పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు పలు వీధుల గుండా బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. మంగళవాయిద్యాలు, అమ్మవారి నామస్మరణలు, భక్తుల కోలాహలంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఊరేగింపును తిలకించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ గంగబాబు, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్య నాయుడు తదితర ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కడారి తమ్మయ్య నాయుడు మాట్లాడుతూ.. దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గొల్లప్రోలు ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.భక్తుల జయజయధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ కర్ణం గారి తోటలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి.

# రాజకీయ రంగంలో అజాత శత్రువు డాక్టర్ ఎన్.సేతుకు

### - శుభాకాంక్షలు తెలిపిన యువనేత శ్రీరామ్ చినబాబు

మదనపల్లె (ప్రజా సీమ)

: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,విజయభారతి పాఠశాల అధినేత డాక్టర్ ఎన్.సేతు పుట్టినరోజు వేడుకలు మంగళవారం అంగరంగా జరిగాయి.బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డితో కలిసి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు శాలువా,పూలమాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడు తూ వర్తమాన రాజకీయాలలో ఎన్.సేతు అజాత శత్రువుగా ప్రసిద్ధిగాంచారన్నారు.మంచి వ్యక్తిత్వం,గొప్ప మనస్తత్వం,అందరినీ ఆప్యాయంగా పలకరించే నైజం ఆయన సొంతమన్నారు.విజయభారతి విద్యాసంస్థ ద్వారా వేలాదిమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి గొప్ప భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు.భగవంతుడి ఆశీస్సులతో ఆయనకు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు కలగాలని,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ అన్నమయ్య జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామి నాయుడు,బీజేపీ సీనియర్ నాయకులు జే.కె వర్మ,పూల నాగరాజు,బీజేపీ యువ మోర్చా నాయకులు శ్రీకాంత్,టీడీపీ బిసి నాయకులు బండి అమర,తెలుగు యువత నాయకులు ప్రభు కురబ గౌడ్,ప్రవీణ్ రాయల్,కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.




# తెలుగు టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడులో స్టేట్ ఫస్ట్ ర్యాంక్

### - జ్యోతికృష్ణ టైపు రైటింగ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ వివి కృష్ణారావు హర్షం

మదనపల్లె (ప్రజా సీమ) :

2026వ సంవత్సరం జూలై నెలలో రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ బోర్డు జరిపిన టైపురైటింగ్ పరీక్షలలో తెలుగు టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ నందు మదనపల్లె పట్టణం,సొసైటీ కాలనీ,జ్యోతి కృష్ణ టైపు రైటింగ్ ఇనిస్టిస్యూట్ విద్యార్థి మద్దెల రాజేష్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారని ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ వివి కృష్ణారావు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లా డుతూ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి నందుకు మద్దెల రాజేష్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో హైస్కూల్ స్థాయిలో నుంచి విద్యార్థులు టైపు రైటింగ్ నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలతోపాటు సాఫ్ట్వేర్ రంగంలో రాణించాలనుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా టైపు రేటింగ్ విషయంలో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.





# గుర్రాజు కుంట వద్ద కాలుష్య కల్లోలం.. కలెక్టర్ ఆగ్రహం!

### - చింతలపూడిలో చెత్త డంపింగ్, దహనంపై కలెక్టర్ వెట్రి సెల్వి సీరియస్!

### - - రోడ్డెక్కితే కంటికి కనిపించని ప్రయాణం.. విద్యార్థులు, ప్రజల నరకయాతన

### - - తక్షణమే చెత్త తొలగించాలని మున్సిపల్ అధికారులకు అల్టిమేటం





(ప్రజా సీమ )

చింతలపూడి – టి. నరసాపురం ప్రధాన రహదారిపై ఉన్న గుర్రాజు కుంట వద్ద మున్సిపాలిటీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చెత్తను డంప్ చేయడమే కాకుండా, దానికి నిప్పు పెడుతున్న వైనంపై ఏలూరులో మున్సిపల్ అధికారులను తీవ్రంగా మందలించారు.

**ప్రయాణికులు, విద్యార్థులకు నరకయాతన!**

చింతలపూడి మున్సిపాలిటీ పరిధిలో సేకరిస్తున్న చెత్తను ట్రాక్టర్ల ద్వారా ఏకంగా గుర్రాజు కుంట వద్దే పడేస్తున్నారు. దీనికి తోడు చికెన్ వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు, పాత ఇళ్ల శిథిలాలను కూడా ఇక్కడే పారబోస్తున్నారు. ఈ చెత్తకు నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగలు అలుముకుని, ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు రోడ్డే కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే స్కూల్ బస్సుల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు, చెరువు నీరు పూర్తిగా కలుషితం కావడంతో మూగజీవాలు, పశువులకు తాగునీరు కరవైందని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

**జీడబ్ల్యూటీ (గ్రీవాన్స్) ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం**

ఎవరైనా ఫిర్యాదు చేస్తే మొక్కుబడిగా చెత్తకు నిప్పు పెట్టడం, లేదంటే జేసీబీలతో చెరువులోకి చెత్తను నెట్టేసి చేతులు దులుపుకోవడం అధికారులకు పరిపాటిగా మారింది. మరుసటి రోజు నుంచి మళ్లీ అదే తంతు కొనసాగుతుండటంతో... టి. నరసాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు ఈ అక్రమ డంపింగ్‌పై పక్కా ఫోటో ఆధారాలతో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని నేరుగా కలిసి ఫిర్యాదు చేశారు.

**షెడ్డు ఉన్నా.. దందాలన్నీ నిబంధనల విరుద్ధమే!**

కాగితాలపై మాత్రం 'చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నామని, ప్రత్యేకంగా షెడ్డు కూడా ఉందని' అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అటువంటి పనులేవీ జరగడం లేదని తేలింది. పర్యావరణానికి తీవ్ర హాని తలపెట్టేలా వ్యవహరించడం సరైంది కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. వెంటనే అక్కడ ఉన్న చెత్తనంతటినీ తొలగించి, తక్షణమే పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇకపై కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠినమైన క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

**ఎన్.జి.టి ని ఆశ్రయిస్తాం: ఎస్.డి. నాసర్ పాషా**

ఇప్పటికైనా చింతలపూడి మున్సిపల్ అధికారులు కళ్లు తెరిచి గుర్రాజు కుంట చెరువు వద్ద చెత్త డంపింగ్‌ను పూర్తిగా నిలిపివేయాలని, దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సామాజిక కార్యకర్త ఎస్.డి. నాసర్ పాషా డిమాండ్ చేశారు. ఎవరైనా ఇక్కడ చెత్త వేస్తే సహించేది లేదని, అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే జాతీయ హరిత ట్రైబ్యునల్ ను ఆశ్రయించడానికి కూడా వెనుకాడబోమని ఆయన విలేకరుల సమావేశంలో హెచ్చరించారు.

# బాపట్ల పాత బస్టాండ్‌లో ప్రయాణికుల నరకయాతన.. పట్టించుకోని పాలకుల తీరుపై ప్రజల ఆగ్రహం!

### - జిల్లా కేంద్రంగా మారినా మారని దుస్థితి

### - కనీస వసతులు కరువవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

### - ఎన్నికల హామీలకే పరిమితమవుతున్న నాయకులు

(ప్రజా సీమ )

"ప్రజల అవసరాలను గుర్తించినవారే అసలైన నాయకులు" అనే నానుడి బాపట్ల పట్టణంలో నీరుగారిపోతోంది. బాపట్ల జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందినా, ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు, మౌలిక వసతుల పరిస్థితి మాత్రం ఎక్కడి గొగ్గెర అక్కడే అన్నచందంగా మారింది. ముఖ్యంగా బాపట్ల పాత బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రద్దీ ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు.అధికారుల, ప్రజాప్రతినిధుల మౌనంపై విమర్శలు పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూస్తున్నా అధికారులైనా, ఇటు ప్రజాప్రతినిధులైనా స్పందించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయం వస్తే చాలు ఇంటింటికీ తిరుగుతూ హామీల వర్షం కురిపించే నేతలు.. గెలిచాక మాత్రం ప్రజలను కేవలం ఓటర్లుగానే చూస్తున్నారే తప్ప, ఇచ్చిన వాగ్దానాలను విస్మరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు "సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం.. అభివృద్ధి చేసి చూపుతాం" అని గొప్పలు చెప్పే నాయకులు, ఆ తర్వాత ఆ సమస్యలను గాలికొదిలేస్తున్నారని మండిపడుతున్నారు.పేరుకే జిల్లా కేంద్రం.. కనీస వసతులు శూన్యం బాపట్లను జిల్లా కేంద్రంగా ప్రకటించి అభివృద్ధి చేస్తామంటున్నా, క్షేత్రస్థాయిలో ఆచరణ మాత్రం శూన్యంగా ఉంది. పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కనీస సదుపాయాలు కరువవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. "మేము ఎప్పటికీ ఈ సమస్యలతోనే ఇలాగే మగ్గిపోవాలా? మా బాధలను పట్టించుకునే నాథుడే లేడా?" అంటూ పట్టణ ప్రజలు నిలదీస్తున్నారు.

?శాశ్వత పరిష్కారమే ధ్యేయం కావాలికేవలం తాత్కాలిక ప్రకటనలు, హడావుడి పనులతో కాలం వెళ్లదీయకుండా.. ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధితో శాశ్వత పరిష్కార మార్గం చూపినవారే ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా బాపట్ల జిల్లా మరియు పట్టణ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి పాత బస్టాండ్ వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

## రూ.2 కోట్లతో మున్సిపల్ ఇండోర్ స్టేడియం ప్రారంభం

## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్







(ప్రజా సీమ )

తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని గణేష్ నగర్లో ఎమ్మెల్యే సొంత నిధులు, దాతల విరాళాలతో కలిపి సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన మున్సిపల్ ఇండోర్ స్టేడియాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి ఆయన ప్రారంభించారు. తొలుత అక్కడి లేబర్ అడ్డా కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో మున్సిపల్ ఇండోర్ స్టేడియం పనులు కొంతకాలంగా నెమ్మదిగా సాగాయని తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చొరవతో స్టేడియం ప్రారంభోత్సవం జరగడం సంతోషకరమని వివరించారు. షటిల్ కోర్టు ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆర్డీవో సూర్యారావు ఒక జట్టుగా, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ మరో జట్టుగా ఏర్పడి కొద్దిసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. నాయకులు, ఉన్నతాధికారులు ఆటలో ఉత్సాహంగా పాల్గొనడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే అధికారులు, ప్రజాప్రతినిధులు క్రీడా మైదానంలో సరదాగా కొంతసేపు ఆటలాడుతూ జోష్ నింపటం విశేషం. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, ఆర్డీవో ఎం. సూర్యరావు, తహసీల్దార్, సునీల్ కుమార్ , కమిషనర్ ఏసుబాబు,పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సుకై పరితపించే వ్యక్తి డాక్టర్ ఎన్.సేతు

## - బిసిహెచ్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బోడెం రాజశేఖర్ ప్రశంసలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

సమాజ హితం కోసం పరితపించే వ్యక్తి విజయభారతి విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.సేతు అని బీసీ హక్కుల పోరాట సమితి (బిసిహెచ్ పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు బోడెం రాజశేఖర్ ప్రశంసించారు.మంగళవారం పట్టణంలోని విజయభారతి పాఠశాల ఆవరణంలో ఎన్.సేతు పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ వేడుకలకు బోడెం రాజశేఖర్ హాజరై సేతును శాలువా,పూలమాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి తన అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ విజయభారతి పాఠశాలను స్థాపించి మూడు దశాబ్దాలకుపైగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు.ప్రతి ఏడాది పదవ తరగతి ఫలితాల్లో విజయభారతి విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు.రాజకీయాలలోనూ తనదైన శైలిలో రాణిస్తున్నారని,బీజెపిలో అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి హోదాలో కొనసాగుతున్నారన్నారు.నిరంతరం విద్యార్థుల వికాసం,ప్రజాశ్రేయస్సుకై పరితపించే డాక్టర్ ఎన్.సేతు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.చౌడం రామాంజులు,కరామత్ బాషా,బండి జయన్న,మురళి,శ్రీనివాసులు,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.




# కడప మేయర్ సీటు మైనార్టీకి కేటాయించకపోతే .. .టీడీపీ గెలుపు కష్టమేనా?

## టిడిపి ముస్లిం మహిళకే అవకాశం కల్పించాలనే డిమాండ్

## ఎమ్మెల్యే , మేయర్ పీఠం ఓకే సామాజిక వర్గానికి అవకాశమా

**కడప అక్టోబర్ 3 (ప్రజాసీమ):**

కడప నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో మేయర్ అభ్యర్థిత్వంపై రాజకీయ చర్చ ఊపందుకుంటోంది. కడప ఎమ్మెల్యేగా మాధవీ రెడ్డి గెలుపొందడం తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఆనందాన్ని నింపినప్పటికీ, మేయర్ పదవి విషయంలో పార్టీ తీసుకోబోయే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. ఎమ్మెల్యే పదవి దక్కిన సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే మళ్లీ మేయర్ పదవికి పోటీ పడుతున్నారనే చర్చ నగర ప్రజల్లో ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే జనరల్ ఓసీ మహిళలకు మేయర్ పదవి కేటాయించిన నేపథ్యంలో, ముస్లిం మైనారిటీ మహిళకు అవకాశం కల్పిస్తే రాజకీయ ప్రాతినిధ్యంలో సమతుల్యతకు మార్గం ఏర్పడుతుందనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో మేయర్ అభ్యర్థిత్వంపై టీడీపీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలకంగా మారింది.

**ముస్లిం మైనారిటీలకు ప్రాధాన్యత.. సామాజిక న్యాయానికి నిదర్శనం!**

ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి అడ్డాగా ఉన్నటువంటి కడప నియోజకవర్గం లో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కడప ఎమ్మెల్యే టికెట్‌ను ముస్లిం మైనారిటీ వర్గానికి కాకుండా మరో సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి కేటాయించినప్పటికీ, ముస్లిం వర్గాల్లోని పలువురు టీడీపీకి మద్దతుగా నిలిచారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిత్వాన్ని ముస్లిం మహిళకు కేటాయించడం ద్వారా మైనారిటీల రాజకీయ ఆకాంక్షలకు గుర్తింపు లభిస్తుందని పలువురు భావిస్తున్నారు. గతంలో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేసిన ఖలీల్ భాషా వంటి నాయకుల రాజకీయ ప్రస్థానం కూడా ఈ సందర్భంగా చర్చకు వస్తోంది. కేవలం పార్టీ పదవులు ఇవ్వడమే కాకుండా, నిర్ణయాధికారం కలిగిన ఎన్నికల పదవుల్లోనూ మైనారిటీలకు అవకాశాలు కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ముస్లిం మహిళకు మేయర్ అభ్యర్థిత్వం కల్పించడం ఒక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, సమానత్వం, సామాజిక న్యాయం పట్ల పార్టీ తన నిబద్ధతను చాటుకునే అవకాశంగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు.




**తక్షణ నిర్ణయం తీసుకోవాలి.. మైనారిటీల ఆకాంక్షలకు గౌరవం ఇవ్వాలి!**

కడప నగర రాజకీయాల్లో ముస్లిం మైనారిటీల పాత్రను దృష్టిలో ఉంచుకుని టీడీపీ అధిష్ఠానం దూరదృష్టితో నిర్ణయం తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. మేయర్ పదవికి ముస్లిం మహిళను ఎంపిక చేయడం ద్వారా ఆ వర్గానికి రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు, ఈ అంశంపై పార్టీ నిర్ణయం ఎలా ఉన్నా, మైనారిటీల అభిప్రాయాలు, స్థానిక నాయకుల సూచనలు, అభ్యర్థి ప్రజాదరణ, అన్ని వర్గాలతో సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. 2029 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మైనారిటీల విద్య, ఉపాధి, సంక్షేమం, రాజకీయ భాగస్వామ్యానికి సంబంధించి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కడప నగరంలో ఇప్పటికే పలు రాజకీయ, సామాజిక విభేదాలు ఉన్న నేపథ్యంలో అన్ని వర్గాల విశ్వాసాన్ని కాపాడుకోవడం కీలకం. ఇప్పటికైనా టీడీపీ అధిష్ఠానం ముస్లిం మైనారిటీ మహిళకు మేయర్ అభ్యర్థిత్వం కల్పించే అంశాన్ని పరిశీలించి, సముచిత నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నిర్ణయం ద్వారా మైనారిటీల రాజకీయ ఆకాంక్షలకు గౌరవం లభించడంతో పాటు, ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసాన్ని బలోపేతం చేసుకునే అవకాశం ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# కంటి సమస్యల నిర్మూలనే ప్రాజెక్ట్ క్లియర్ విజన్ లక్ష్యం

## - ప్రాజెక్టు సమన్వయకర్త ఇర్రి నాగప్రసాద్ నాయుడు వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

శ్రీ అఖండ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ (ఎస్ఎఎన్ఎస్డిటి) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్ట్ క్లియర్ విజన్‌లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా పట్టణంలోని అనపగుట్టలో సెప్టెంబర్ 18న ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించగా 145 మందికిపైగా ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఇందులో కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి సోమవారం కళ్లద్దాలు అందజేశారు.ట్రస్ట్ వ్యవస్థాపకులు కె.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఇ.నాగప్రసాద్ నాయుడు సమన్వయంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఇ.నాగప్రసాద్ నాయుడు మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానమని,ఇందులో మానవునికి కళ్లు ఎంతో ముఖ్యమని,సేవ ద్వారా వారి జీవితాల్లో స్పష్టత తీసుకురావడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు.నిస్వార్థమైన సమాజ సేవలు అందించడానికే శ్రీ అఖండ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.దృష్టిలోపం ఉన్నవారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అద్దాలు పంపిణీ చేశామన్నారు.ఇదే స్ఫూర్తితో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని,సమాజసేవ కార్యక్రమాలలో తమ ట్రస్ట్ ముందు వరుసలో నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.






# రాజ్యాంగ సంస్థలను దూషించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

## - బిజెపి నేత గాలి హరిప్రసాద్

**వేంపల్లె ప్రజాసీమ:**



రాజ్యాంగ సంస్థలపై నిరాధర ఆరోపణలు, ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థ, ఇతర రాజ్యాంగబద్ధ సంస్థలు తమ పరిధిలో స్వతంత్రంగా పనిచేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. వీటి నిర్ణయాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో ప్రశ్నించాలి, లేదా ఆధారాలతో విమర్శలు చేయాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం స్వయం ప్రతిపత్తి సంస్థల విశ్వసనీయతను ప్రశ్నించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు అడగడం ప్రతిపక్ష బాధ్యతే.. అదే సమయంలో ప్రతి ఆరోపణకు వాస్తవాలు, ఆధారాలు ఉండడం కూడా అంతే ముఖ్యమన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే రాజకీయ పార్టీలు తమ రాజకీయ విబేధాలను రాజ్యంగ వ్యవస్థల గౌరవానికి భంగం కలగకుండా వ్యక్తం చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శకు స్థానం ఉంది.. కానీ బాధ్యతాయుతమైన విమర్శకే విలువ ఉందన్నారు.

# స్థానికులకే వార్డు కౌన్సిలర్లుగా ప్రాధాన్యతనివ్వాలి

## - స్థానికేతరుల పోటీపై ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలి

## - ఏబీసీ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు పరిధిలో నివసిస్తూ,అక్కడే ఓటుహక్కు కలిగిన అభ్యర్థులకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని ఏబీసీ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి కోరారు.ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానికేతరులు ఎన్నికల్లో పోటీచేసే అంశంపై ప్రజలు పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.స్థానిక వార్డు ప్రజలతో మమేకమై,వారి సమస్యలను,అవసరాలను క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడంతోపాటు,ఆయా కుటుంబాల పరిస్థితులు,వార్డులోని అవసరాలపై స్థానిక అభ్యర్థులైతే మెరుగైన అవగాహన ఉంటుందని గుర్తుచేశారు.అలాంటి వ్యక్తులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతే ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంతోపాటు,వార్డు అభివృద్ధికి కృషి చేసే అవకాశం ఉంటుందన్నారు.వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు,మౌలిక సదుపాయాల కల్పన,అర్హులకు పింఛన్లు,రేషన్ కార్డులు,సంక్షేమ పథకాలు సక్రమంగా అందించడానికి,స్థానికంగా నివసించే అభ్యర్థులు క్షుణ్ణంగా అర్థం చేసుకోగలరని వివరించారు.స్థానిక అభ్యర్థులకు తమ వార్డులోని ప్రజల ఇబ్బందులు,అవసరాలపై స్పష్టమైన అవగాహన ఉంటుందని తెలిపారు.రాజకీయ పార్టీలు స్థానికేతరులను ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రోత్సహించే విషయంలో పునరాలోచించాలని అభిప్రాయపడ్డారు. అయితే,తాము స్థానికేతరుల పోటీకి పూర్తిగా వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తూ,వార్డు అభివృద్ధి,ప్రజలతో నిరంతర సంబంధాలు,సమస్యల పరిష్కా రానికి ప్రాధాన్యతనిచ్చే అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు.ప్రజల మధ్య ఉంటూ,వారి అవసరాలను గుర్తించి,వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేసే స్థానిక నాయకులను ఎన్నుకునే విషయంలో ఓటర్లు ఆలోచనాత్మక నిర్ణయం తీసుకోవాలని డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి విజ్ఞప్తి చేశారు.



# స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలి

## - 50 శాతం రిజర్వేషన్ల పరిమితికి లోబడి ప్రక్రియ పూర్తిచేయాలి

## - జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్

**మదనపల్లె (ప్రజా సీమ) :**



స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలు,నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పంచాయతీ రాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల ఉన్నతాధికారులు జిల్లా కలెక్టరును ఆదేశించారు.సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని పాటిస్తూ,జీవో 154 ప్రకారం నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం వారు చేశారు.మంగళవారం రాష్ట్రసచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్,పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే,పంచాయతీరాజ్ కమిషనర్,మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపు విధానం,అధికారుల బాధ్యతలు,అనుసరించాల్సిన మార్గదర్శకాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా మదనపల్లె కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ,సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి హాజరయ్యారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీ వర్గాలకు 2011 జనాభా లెక్కల ఆధారంగా బీసీ వర్గాలకు తాజా ఓటర్ల జాబితా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని మార్గదర్శకాల్లో పేర్కొనడం జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివరించారు.గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు,సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,ఎంపీపీలు,జెడ్పీటీసీల రిజర్వేషన్ల ప్రక్రియలోనూ వర్తించే నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించకుండా చూడాలన్నారు.జీవో 154 ప్రకారం రిజర్వేషన్ల కేటాయింపులో అధికారుల బాధ్యతలను నిర్దేశించడం జరిగిందన్నారు.గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు,సర్పంచ్‌లు,ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి రెవెన్యూ డివిజనల్ అధికారి,ఎంపీడీవోలకు అప్పగించిన బాధ్యతల మేరకు చర్యలు చేపట్టాలన్నారు.జిల్లా పరిధిలో ఎంపీపీ,జెడ్పీటీసీ స్థానాలకు కేటగిరీల వారీగా రిజర్వేషన్ల నిర్ణయం,స్థానాల కేటాయింపును జిల్లా కలెక్టర్ చేపట్టాలన్నారు.జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి సంబంధించిన రిజర్వేషన్ల కేటాయింపును రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారని తెలిపారు.వీసీ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ,జెడ్పీటీసీ,ఎంపీపీ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియను మంగళవారం రాత్రిలోగా,సర్పంచ్‌లు,గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియను బుధవారం సాయంత్రంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు.ప్రక్రియ పూర్తయిన అనంతరం జిల్లా గెజిట్‌లో ప్రచురించి,గెజిట్ ప్రతిని రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించాలని సూచించారు.గతంలో ఏవైనా జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా, నిబంధనల్లో ఎలాంటి ఉల్లంఘనలకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి రిజర్వేషన్ల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ వీసీలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ప్రభాకర్ రావు,జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ,మున్సిపల్ కమిషనర్ ప్రమీల,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసీమ

# ఇండస్ట్రీ 5.0 మిట్స్ వర్సిటీలో సాంకేతికతలపై అవగాహన సదస్సు

## - హాజరైన వీఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయేంద్ర బాబు






**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) మరియు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగాల వారు ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇండస్ట్రీ 5.0,స్మార్ట్ తయారీ వ్యవస్థలు,కృత్రిమ మేధస్సు ఆధారిత స్వయంచాలక వాహన సాంకేతికతలపై అవగాహనా సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)లోని స్కూల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్,ఎంబెడెడ్ టెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయేంద్ర బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పారిశ్రామిక రంగంలో ఇండస్ట్రీ 5.0 సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.స్మార్ట్ తయారీ వ్యవస్థల్లో మానవులు,యంత్రాల మధ్య సమన్వయం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడం,మానవ తప్పిదాలను తగ్గించ డం సాధ్యమవుతుందన్నారు. కృత్రిమ మేధస్సు,రోబోటిక్స్,ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్,స్వయం చాలక సాంకేతికతలు పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదపడుతు న్నాయని ,విద్యార్థులు వీటిపై పట్టు సాధించాలన్నారు. ముఖ్యంగా ఈసీఈ,ఈఈఈ విద్యార్థులు ఎంబెడెడ్ వ్యవస్థలు,స్మార్ట్ పరికరాల రూపకల్పన, పారిశ్రామిక ఆటోమేషన్, విద్యుత్ శక్తి సామర్థ్యం ,పర్యావరణహిత సాంకేతి కతలపై నైపుణ్యాలను పెంపొందించుకో వాలన్నారు.అధునాతన డ్రైవర్ సహాయక వ్యవస్థలు (ఏడీఏఎస్),కృత్రిమ మేధస్సు ఆధారిత స్వయంచాలక వాహన సాంకేతిక తల ప్రాముఖ్య తను రిస్తూ,సెన్సార్లు,కెమెరాలు,రాడార్,లైడార్ వంటి ఆధునిక పరికరాలు వాహనాల చుట్టూ ఉన్న పరిస్థితులను గుర్తించడం ,డ్డంకులను విశ్లేషించడం,ప్రమాదాలను నివారించడం,రహదారి భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు,ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్,వాహన నియంత్రణ వ్యవస్థలు,తెలివైన రవాణా వ్యవస్థలకు మరింత ప్రాధాన్యం పెరగనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్,విభాగాధిపతులు డాక్టర్ సంజయ్ కుమార్ గౌర్,డాక్టర్ మనవాలన్ గుణశేఖరన్,కో-ఆర్డినేటర్స్ డాక్టర్ శరవణ కుమార్,కె.రేవతి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రికెట్ కిట్లను పంపిణీ చేసిన విశ్రాంత డి ఎస్ పి!

**పుంగనూరు ప్రజా సీమ :**

పట్టణానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు విశ్రాంత డీఎస్పీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుకుమార్‌బాబు సుమారు రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్లను మంగళవారం క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత డి.ఎస్.పి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని తెలిపారు. గతంలోనూ క్రికెట్, వాలీబాల్, షటిల్ తదితర క్రీడా సామగ్రిని 50కిపైగా టీములకు అందించినట్లు ఆయన తెలిపారు. క్రీడా కిట్లు అవసరమైన యువకులు తనను సంప్రదిస్తే వారికి కిట్లను అందజేస్తానని , త్వరలో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన క్రీడాకారులు గిరీష్, సాయి, ఈశ్వర్, పురుషోత్తం, నవీన్, వెంకటేష్, రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్య,సేవా రంగాలలో డాక్టర్ ఎన్.సేతు సేవలు అమోఘం

## - కొనియాడిన కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

విజయభారతి విద్యాసంస్థల అధినేత,బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ ఎన్.సేతు గొప్ప విద్యావేత్త,స్ఫూర్తిప్రదాత అని కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి ప్రశంసించారు.మంగళవారం సేతు జన్మదినాన్ని పురస్కరించుకుని పసుపులేటి చలపతితోపాటు బిల్డర్ మురళి,బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ కుమార్,బుల్లెట్ షఫీ,మాజీ ఉపసర్పంచ్ నాగరాజులు గజమాలతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పసుపులేటి చలపతి మాట్లాడుతూ విద్యారంగంలో డాక్టర్ ఎన్.సేతు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థుల నాణ్యమైన విద్యను అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు ఆయన బాటలు వేస్తున్నారని కొనియాడారు.విద్యారంగంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ,ప్రజాసేవలోనూ మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు.డాక్టర్ ఎన్.సేతు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.




# ఘనంగా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఆవిర్భావ దినోత్సవం

## - హాజరైన యూనిట్ ప్రధాన కార్యదర్శి ఎన్.మునిగోపాల కృష్ణ

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 1984 అక్టోబర్ 13వ తేదీన ఏర్పాటైంది. రిజిస్ట్రేషన్ నెంబరు 15 63 /1984.ఈ సంఘం ఏర్పాటులో బషీరు ద్దీన్ అహ్మద్,వి.వద్మారావు,కె.భుజంగ రెడ్డి,వి.శరవనం రామ్మూర్తి తదితరులు క్రియాశీలక పాత్ర పోషించారు.ఈ నేపథ్యంలో మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన ,మదనపల్లిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు .బెంగళూరు రోడ్డులోని జిఆర్టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి వి.శంకరయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమానికి మదనపల్లె యూనిట్ అధ్యక్షులు బివి రమణ,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.ముని గోపాల కృష్ణ,ట్రెజరర్ తిమ్మయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు,వైస్ ప్రెసిడెంట్ మురళి,కేశవరెడ్డి,మహిళా ప్రతినిధులు శకుంతలమ్మ,ధనలక్ష్మి,జాయింట్ సెక్రెటరీ జగన్మోహన్,శివప్రసాద్,రాయచోటి,పుంగ నూరు,కలికిరి,వాయల్పాడు,గుర్రంకొండ,వ ందనపల్లి,పీలేరు మొదలగు యూనిట్ సభ్యులు హాజరై ఘనంగా ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు.మొదట రాష్ట్ర పతాకాన్ని ఆవిష్కరించి విశ్రాంత ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శంకరయ్య ఇటీవల రాష్ట్ర ఎన్నికలలో రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.ఈ శుభ సందర్భంలో అన్నమయ్య జిల్లాలోని అన్ని యూనిట్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు,జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు ఘనంగా సన్మానించారు .అధ్యక్షులు రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వము రెండు డి.ఆర్ లు ఇచ్చినందుకు ధన్యవాద ములు తెలియజేశారు.ఇంకనూ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ జనవరి 2027 నుండి 70 సంవత్సరాల నుండి 75 సంవత్సరముల వారికి 7% నుండి 10% మరియు 75 సంవత్సరాల నుండి 80 సంవత్సరాలు వారికి 12% నుండి 15%కు



పెంచుకున్నట్లు జీవో విడుదల చేశారు.రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన టువంటి బకాయిలు త్వరితగతిన చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర కార్యదర్శి అయినటు వంటి వి.శంకరయ్య మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని అన్ని యూనిట్ల వారు,జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు అందరూ కలిసి తనను ఘనంగా సన్మానించినందుకు ధన్యవాదములు తెలిపారు.మదనపల్లి యూనిట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మునిగోపాల కృష్ణ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శంకరయ్యకి రాష్ట్ర కార్యదర్శి పదవి ఇవ్వడం శుభసూచకమని, అన్నమయ్య జిల్లా సమస్యలను రాష్ట్రస్థాయిలో తెలియజేసి మన సమస్యల పరిష్కారానికి చేయూతగా ఉంటారని, అందరికీ అందుబాటులో ఉంటున్నారని సంతోషం వ్యక్తపరిచారు.మదనపల్లి యూనిట్ అధ్యక్షులు బివి రమణ మాట్లాడుతూ ప్రభుత్వము మనకు వెంటనే ఇంటీరియమ్ రిలీఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# చందన షాపింగ్ మాల్‌లో ఘనంగా దసరా సంబరాలు

## ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నేత డాక్టర్ నవీన్ కుమార్.. లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానం

**రాజంపేట (ప్రజా సీమ):**

రాజంపేట పట్టణంలోని ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ చందన షాపింగ్ మాల్‌లో దసరా పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ దగ్గుపాటి నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చందన షాపింగ్ మాల్ యాజమాన్యం డాక్టర్ నవీన్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికింది. అనంతరం దసరా పండుగను పురస్కరించుకుని నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన వినియోగదారులకు ఆయన చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, చందన షాపింగ్ మాల్ వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించడంతో పాటు పండుగల వేళ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వినియోగదారులతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందించడం ద్వారా సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చందన షాపింగ్ మాల్ ప్రతినిధులు, సిబ్బంది, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# గొల్లప్రోలు మున్సిపల్ చైర్మన్‌గా గుండ్ర సుబ్బారావుకు అవకాశం దక్కేనా?

## 20 ఏళ్లుగా టీడీపీకి సేవలు.. కష్టకాలంలోనూ పార్టీ వెంటే..

## సముచిత గుర్తింపుపై శ్రేణుల్లో ఆసక్తి!

**గొల్లప్రోలు :(ప్రజా సీమ )**

గొల్లప్రోలు మున్సిపల్ చైర్మన్ పదవిపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి సేవలందిస్తూ, పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తలకు అండగా నిలిచిన ఆయనకు చైర్మన్ పదవి దక్కుతుందా? అన్న ఆసక్తి స్థానిక పార్టీ శ్రేణుల్లో నెలకొంది.గొల్లప్రోలులో టీడీపీకి రాజకీయంగా సవాళ్లు ఎదురైన సమయంలోనూ గుండ్ర సుబ్బారావు పార్టీని వీడకుండా కార్యకర్తలతో కలిసి పనిచేశారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తూ, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయానికి ప్రాధాన్యమిచ్చారని చెబుతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగారని పార్టీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన పవన్ కళ్యాణ్ విజయానికి పార్టీ పిలుపు మేరకు సుబ్బారావు తనవంతు కృషి చేశారని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి. గొల్లప్రోలు పట్టణంలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కూటమి విజయానికి పనిచేశారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.గొల్లప్రోలు మున్సిపల్ చైర్మన్ పదవిని కూటమిలో ఏ పార్టీకి కేటాయిస్తారనే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ టీడీపీకి అవకాశం దక్కితే, దీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న గుండ్ర సుబ్బారావుకు ప్రాధాన్యం లభిస్తుందా? అన్న చర్చ స్థానికంగా సాగుతోంది. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు కల్పిస్తే కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు.మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై పార్టీ అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కూటమి పెద్దలు తీసుకునే నిర్ణయంపై స్థానిక రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్న గుండ్ర సుబ్బారావుకు చైర్మన్ పదవి దక్కుతుందా? ఆయన సేవలకు సముచిత గుర్తింపు లభిస్తుందా? అనేది అధిష్టానం నిర్ణయంతో తేలనుంది.




# వైభవంగా భాకరాపేటలో దుర్గామాతకు పూజలు

## భాకరాపేట అర్చకులు మధుసూదన్ శర్మ

**సిద్ధవటం ప్రజా సీమ**

మండలంలోని భాకరాపేట గ్రామంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల రెండవ వార్షికోత్సవ సందర్భంగా దుర్గామాత గాయత్రి దేవి అలంకారముతో భక్తులకు దర్శనం ఇచ్చింది సందర్భంగా ప్రధాన అర్చకులు మధు మధుసూదన్ శర్మ మాట్లాడుతూ శరన్నవ రాత్రుల దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారి మూల విరాట్ గ్రహానికి గణపతి పూజ, కుంకుమార్చన పంచామృత అభిషేకాలు నిర్వహించామని తెలిపారు పూజా కార్యక్రమంలో చీర్ల పవన్ కుమార్ నాయుడు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు

ప్రజాసీమ

# చందన షాపింగ్ మాల్‌లో ఘనంగా దసరా సంబరాలు

## ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నేత డాక్టర్ నవీన్ కుమార్.. లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానం

**రాజంపేట (ప్రజా సీమ):**

రాజంపేట పట్టణంలోని ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ చందన షాపింగ్ మాల్‌లో దసరా పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ దగ్గుపాటి నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చందన షాపింగ్ మాల్ యాజమాన్యం డాక్టర్ నవీన్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికింది. అనంతరం దసరా పండుగను పురస్కరించుకుని నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన వినియోగదారులకు ఆయన చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, చందన షాపింగ్ మాల్ వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించడంతో పాటు పండుగల వేళ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వినియోగదారులతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందించడం ద్వారా సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చందన షాపింగ్ మాల్ ప్రతినిధులు, సిబ్బంది, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అనారోగ్యంతో కోలుకుంటున్న కృష్ణయ్యకు వీణూా వ్యవస్థాపకులు పెద్దపల్లి శేఖర్ పరామర్శ.

**పీలేరు ప్రజాసీమ :**

అనారోగ్యానికి గురై తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం కోలుకుంటున్న మాదిగదల పోరాట సమితి (వీణూా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం తండ్రి కృష్ణయ్యను వీణూా వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ పరామర్శించారు. పీలేరు మండలం కోళ్లఫారం గ్రామానికి చెందిన కృష్ణయ్య ఇటీవల అనారోగ్యానికి గురై రుయా ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడటంతో స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న వీణూా వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ మంగళవారం కోళ్లఫారం గ్రామానికి చేరుకుని కృష్ణయ్యను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వీణూా నాయకులు కృష్ణయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. సంస్థ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వీణూా రాష్ట్ర అధికార ప్రతినిధి సీవీ రమణ, రాష్ట్ర కోర్ కమిటీ ఉపాధ్యక్షులు రవి, కోర్ కమిటీ సభ్యులు గురుశంకర్ ప్రసాద్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి అశోక్ కుమార్, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు ఆదినారాయణ, చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షులు వెంకటరమణ, పీలేరు మండల ప్రధాన కార్యదర్శి రామచంద్ర, పీలేరు మండల ఉపాధ్యక్షులు జి. హరినాథ్‌తో పాటు భాను, విష్ణు తేజ, దేవేంద్ర, కృష్ణయ్య, సాలమ్మ, స్వాతి, నాయక్, లోకేష్, శివగామిని, మోహన్, వెంకటేష్, రామ్మూర్తి, మహేష్, హరినాథ్, విష్ణు తదితర వీణూా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పుంగనూరు పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ!

## పోలింగ్ కేంద్రం మార్పు అంశం కలెక్టర్ దృష్టికి తీసుకువెళతాం!

**పుంగనూరు ప్రజాసీమ :**

జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం పుంగనూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ బూత్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. అలాగే, నగిరి వీధిలోని పోలింగ్ కేంద్రం మార్పు అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్బరాయుడు ఎస్ఐ అన్సర్ బాషా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఉల్లి, సన్నబియ్యం కౌంటర్లు ఏర్పాటు చేయాలి

## - ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక రైతు బజార్ లో ఉల్లి, సన్నబియ్యం కొనుగోలు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం, ఉల్లిపాయల ధరలు గత కొంత కాలంగా గణనీయంగా పెరిగాయన్నారు. సన్నబియ్యం ధర దాదాపు 25 శాతం పెరిగిందని, బహిరంగ మార్కెట్లో కిలో రూ.85 వరకు ఉందన్నారు. ఈ నేపథ్యంలో సామాన్యులకు ఉపశమనం కలిగేలా ఏపి ప్రభుత్వం రైతు బజార్ ద్వారా సబ్సిడీపై సన్నబియ్యం అందించడం హర్షణీయం అన్నారు. ప్రభుత్వం బిపిటి సన్నబియ్యం కిలో రూ.49 లకు విక్రయిస్తూ ఉందన్నారు. అలాగే ఉల్లి ధరలు కూడా విపరీతంగా పెరిగాయని, రైతు బజార్ ద్వారా కిలో రూ. 35 లకు ప్రభుత్వం అందిస్తోందన్నారు. వేంపల్లె రైతు బజార్ లో ఇంతవరకు ప్రభుత్వం సన్నబియ్యం, ఉల్లి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయలేదన్నారు. వీటిని ఏర్పాటు చేసి, సామాన్య ప్రజలను ఆదుకోవాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



# శ్రీ శ్రీ శ్రీ నిత్యపూజ స్వామి తలనీలాల వేలంపాట

## 4, 84,000 దక్కించుకున్న ప్రొద్దుటూరు నివాసి

**సిద్ధవటం ప్రజా సీమ**

లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వరుని కార్తీక మాసాల తల నీలాల వేలంపాట ప్రొద్దుటూరు గ్రామ నివాసి , మునిశేఖర్ దక్కించుకున్నాడు మండల కేంద్రమైన సిద్ధవటంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో మంగళవారం నిత్య పూజేశ్వరుని కార్తీక మాసాల తల నీలాల వేలంపాట దేవాదాయ శాఖ అధికారులు నిర్వహించారు వేలంపాటలో ప్రొద్దుటూరు, గుంతకల్, చాపాడు వంతాటిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు తల నీలాల వేలంపాటలో పాల్గొన్నారు దేవస్థానం , వారి పాట 3 లక్షలకు, కేటాయించగా హెచ్చుదారుడుగా ప్రొద్దుటూరు గ్రామ నివాసి కార్తిక మాసాలకు నవంబర్ 10 నుండి, డిసెంబర్ 8 వరకు స్వామి వారికి తమ మొక్కుబడులుగా భక్తులు సమర్పించే తల నీలాల వేలంపాట 4,84,000/దక్కించుకున్నాడు, ఈ కార్యక్రమంలో శ్రీ నిత్య పూజ స్వామి దేవస్థానం చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్ యాదవ్, ఎండోమెంట్






# చంద్రఘంటా దేవి అలంకరణతో దుర్గమ్మ

## - పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శనం

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక సాయినగర్ లో వెలసిన శ్రీదుర్గాదేవి ఆలయంలో చంద్రఘంటా దేవి అలంంకరతో దుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ రెడ్డి వెల్లడించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు దుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో పంచామృత అభిషేకం, మంత్రపుష్పం, మహా మంగళ హారతి తదితర విశేష పూజల అనంతరం చంద్రఘంటా దేవి అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే తీర్థ ప్రసాదాలు అందజేశారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గమ్మను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా విద్యుత్ దీపాల నడుమ ప్రత్యేక పూలతో అలంకరించారు. పది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 20న దుర్గమ్మ తల్లి గ్రామోత్సవాన్ని ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గమ్మ కటాక్షాన్ని పొందాలని ఆకాంక్షించారు.




# చంద్రఘంటా దేవి అలంకరణతో దుర్గమ్మ

## - పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శనం

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక సాయినగర్ లో వెలసిన శ్రీదుర్గాదేవి ఆలయంలో చంద్రఘంటా దేవి అలంంకరతో దుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ రెడ్డి వెల్లడించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు దుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో పంచామృత అభిషేకం, మంత్రపుష్పం, మహా మంగళ హారతి తదితర విశేష పూజల అనంతరం చంద్రఘంటా దేవి అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే తీర్థ ప్రసాదాలు అందజేశారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గమ్మను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా విద్యుత్ దీపాల నడుమ ప్రత్యేక పూలతో అలంకరించారు. పది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 20న దుర్గమ్మ తల్లి గ్రామోత్సవాన్ని ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గమ్మ కటాక్షాన్ని పొందాలని ఆకాంక్షించారు.



# శ్రీ శ్రీ శ్రీ మానసా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

## ఆలయ వ్యవస్థాపకులు లక్ష్మయ్య

**సిద్ధవటం (ప్రజా సీమ)**

కడప జిల్లా సిద్ధవటం మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ కడప చెన్నై జాతీయ రహదారి కనుములోపల్లి సమీపాన వెలసిన శ్రీ మానసాదేవి అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పోటెత్తారు సిద్ధవటం మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కనుములోపల్లి సమీపాన వెలసిన శ్రీమానసదేవి ఆలయానికి దేవీ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మంగళవారం 3 వ రోజు సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలులో పాల్గొన్నారు ఈ సందర్భంగా మహిళా భక్తులు మాట్లాడుతూ దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చామని ప్రతి పౌర్ణమికి,, అమావాస్య రోజుల్లో మానసా దేవి ఆలయానికి వస్తుంటామని ఎంతో మహిమగల అమ్మవారు మానసా దేవి అమ్మవారు భక్తుల కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యలు వంటి సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య భక్తులకు మెరుగైన వసతులు ఏర్పాటు చేశారని ఆలయానికి వచ్చిన ప్రతి ఒకరికి అమ్మవారి ప్రసాదంగా అన్నప్రసాదాలు వితరణ చేస్తున్నారని పేర్కొన్నారు మానస దేవి అమ్మవారిని ప్రతి ఒక్కరు దర్శించాలని భక్తులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శర్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు





# సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలి

## - మలేరియా అధికారి సిద్దయ్య

**వేంపల్లె ప్రజాసీమ:**

ప్రస్తుతం నెలకొని ఉన్న సీజనల్ వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య దిశానిర్దేశం చేశారు. మంగళవారం తాళ్లపల్లి పిహెచ్సి లో ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు ప్రజలకు అప్రమత్తతో పాటు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు గురించి తెలపాలని సూచించారు. అలాగే ప్రజలు కూడా తమ ఇంటి చుట్టుపక్కల వర్షపు నీరు నిల్వ ఉండకుండా, పరిసర ప్రాంతాల్లో శుభ్రత చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. దోమతెరల వినియోగం, కిటికీలకు మెస్ లు అమర్చుకోవడం, ఒంటిని పూర్తిగా కప్పే దుస్తులు ఉపయోగించు కోవాలని కోరారు. మురుగు కాలువలు శుభ్రపరచడంతో పాటు బ్లీచింగ్, యాంటి లార్వా ద్రావణాల పిచికారి వంటి చర్యలు చేపట్టాలని సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఫకృద్దీన్, అంకయ్య, అరుణాదేవి, తులసమ్మ, కమ్యూనిటీ హెల్త్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కన్నుల పండుగలా డాక్టర్ ఎన్.సేతు పుట్టినరోజు వేడుకలు

## - శుభాకాంక్షలు తెలిపిన పట్టణ ప్రముఖులు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,విజయభారతి విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.సేతు జన్మదిన వేడుకలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి.ఈ నేపథ్యంలో శ్రీ గుడ్‌విల్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో వివిఆర్ గ్రాండ్ అధినేత సుధాకర్ రెడ్డి,ట్రాఫిక్ సీఐ చాంద్ బాషా,విశ్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రఘునాథ్ రెడ్డి,శంకర్,ఎస్.బి రామమూర్తి శాలువా,పూలమాలతో సేతును ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్య,సామాజిక సేవా,రాజకీయ రంగాలలో ఎన్.సేతు తనదైన ముద్రవేస్తున్నారన్నారు.33 సంవత్సరాల క్రితం విజయభారతి పాఠశాలను స్థాపించి మెరుగైన విద్యా ప్రమాణాలు పాటిస్తూ రాష్ట్రంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో ఒకటిగా నిలిపారని కొనియాడారు.విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు దేశభక్తి,సామాజిక స్పృహను పెంపొందించడంలో పాఠశాలను ముందు వరుసలో నిలుపుతున్నారని ప్రశంసించారు.అదేవిధంగా రాజకీయాలలోను తనదైన శైలిలో రాణిస్తున్నారని భారతీయ జనతా పార్టీ బలోపేతానికి విశేష కృషిచేస్తున్నారని,ఆయన సమర్థతను గుర్తించి అధిష్టానం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు అప్పగించడం గర్వకారణమన్నారు.పదవుల కంటే సమాజ శ్రేయస్సే ముఖ్యమని భావించే డాక్టర్ ఎన్.సేతు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆయన ఆకాంక్షించారు.



# సిద్ధవటం లో విస్తృత వాహనాలు తనిఖీ

## ఎస్సై పి హారిక

**సిద్ధవటం (ప్రజా సీమ)**

సిద్ధవటం గ్రామ శివారులోని ఫారెస్ట్ తనిఖీ కేంద్రం వద్ద మండల ఎస్సై హారిక మంగళవారం సాయంత్రం విస్తృత వాహనాలు తనిఖీ చేపట్టారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు హెల్మెట్ వాహన పత్రాలు లేని 5 ద్విచక్ర వాహనదారులకు ఒక్కో వాహనానికి185, రూ జరిమానా విధించామన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు



# మధుర మీనాక్షి అలంకారంలో చౌడేశ్వరి దేవి!

**పుంగనూరు ప్రజా సీమ :**

మండల పరిధి లోని చదళ్ల గ్రామంలో కొలువుదీరిన సప్తమాతృక సమేత చౌడేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు మధుర మీనాక్షి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్. వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.అమ్మవారి ఆలయాన్ని వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించిన సువాసనభరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపకులు వేణుగోపాల్ రెడ్డి దంపతులు గణపతి పూజ, గణపతి హోమం, శ్రీ సుబ్రహ్మణ్య స్వామిహోమం,పుణ్యాహవచనం,సప్తమాతృకల ఆరాధన, హోమాలతో పాటు చౌడేశ్వరి దేవి మూలమంత్ర హోమయాగం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మధుర మీనాక్షి దేవిగా ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



# అన్నపూర్ణాదేవి అలంకరణతో దుర్గామాత

**సిద్ధవటం (ప్రజా సీమ)**



మండలంలోని సాయినగర్ గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారు భక్తులకు మంగళవారం అన్నపూర్ణ దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చింది ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అమర్నాథ్ శర్మ మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రుల 8 వ వార్షికోత్సవ సందర్భంగా దుర్గామాత అమ్మవారి భక్తులకు అన్నపూర్ణ దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చిందన్నారు పి ఆర్ బి అధినేత పుత్త రామచంద్రయ్య కుటుంబీకులు ఉత్సవాలకు సహకరించి దుర్గామాత విగ్రహాన్ని సమర్పించారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు టిడిపి నేత పుత్త బాబు తదితరులు పాల్గొన్నారు

# పార్వతీ దేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ!

**చౌడేపల్లి ప్రజాసీమ :**

ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానము నందు అత్యంత వైభవముగాజరుగుచున్న దసరామహోత్సవము లో రెండవ రోజు మంగళవారం అమ్మవారు పార్వతి దేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చింది ఆలయ అర్చకులు ఉభయదారులతో గణపతి హోమము, చండీ హోమము నిర్వహించినారు.ఈకార్యక్రమములో దేవస్థానఉపకమీషనరు, కార్యనిర్వహణాధికారి ఏకాంబరం, దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొని వారికి తీర్థ ప్రసాదములు అందజేసి అమ్మవారి దర్శన భాగ్యము కల్పించినారు.



# ఎరువులు పంపిణీ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ఏడిఏ!

**పుంగనూరు ప్రజాసీమ :**

పట్టణంలోని మండల వ్యవసాయ కార్యాలయం నందు మంగళవారం డీలర్లకు సిబ్బందికి ఎఫ్ ఎఫ్ ఎస్ పద్ధతిలో ఎరువులు పంపిణీ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శివకుమార్ ఏ ఓ రాధా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎఫ్ ఎఫ్ ఎస్ విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎరువులను పంపిణీ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్లు రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



# చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు: పిఠాపురం సీఐ జీవీవీ సత్యనారాయణ హెచ్చరిక

**పిఠాపురం : (ప్రజా సీమ )**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో పోలీస్ అధికారులు విస్తృతంగా పర్యటించారు. మంగళవారం పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ +.ఎ.ఎ. సత్యనారాయణ, స్థానిక ఎస్సై మరియు పోలీస్ సిబ్బందితో కలిసి కందరాడ, ఫక్రుద్దీన్ పాలెం గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ మరియు కౌంటింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ గ్రామస్తులతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు, గొడవలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని కోరారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించి, పోలీసులకు మరియు పోలింగ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు.ఎన్నికల తరుణంలో ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. అలాంటి వారిపై తగిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరి సహకారంతో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూస్తామని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు.





# విద్యా,రాజకీయ రంగాలల్లో ఆణిముత్యం డాక్టర్ ఎన్.సేతు

## - శుభాకాంక్షలు తెలిపిన మదనపల్లి ప్రెస్ క్లబ్ పాత్రికేయులు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

విద్యా వ్యవస్థకు వెలుగు,విద్యార్థులకు మార్గదర్శి,సమాజ హితం కోసం పరితపించే వ్యక్తి విజయభారతి విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.సేతు నల్లుస్వామి అని మదనపల్లె ప్రెస్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని విజయభారతి పాఠశాల ప్రాంగణంలో డాక్టర్.సేతు నల్లుస్వామి పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ వేడుకలకు మదనపల్లె ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నక్కింటి రవీంద్ర,సెక్రటరీ మోడెం శ్రీనివాసరావు,10 టివి రిపోర్టర్ లక్ష్మీపతి,ఎన్95 మణి,ఆంధ్రనాడు హరి,రన్ టీవీ రిపోర్టర్స్ వెంకటేష్,రఫీ తదితరులు హాజరై సేతును భారీ పూలమాల వేసి,శాలువాతో సత్కరించి,పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయ భారతి పాఠశాలను స్థాపించి మూడు దశాబ్దాలకుపైగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి,వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు.ప్రతి ఏడాది పదవ తరగతి ఫలితాల్లో విజయభారతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు.రాజకీయాలలోనూ తనదైన శైలిలో రాణిస్తున్నారని,బీజెపిలో అంచలంచెలుగా ఎదిగి,ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి హోదాలో కొనసాగుతున్నారన్నారు.నిరంతరం విద్యార్థుల వికాసం,ప్రజాశ్రేయస్సుకై పరితపించే డాక్టర్ సేతు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.




# శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపనకు హాజరుకండి

## - తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబుకి ఆహ్వానం

**మదనపల్లె (ప్రజా శక్తి) :**

అన్నమయ్య జిల్లా,మదనపల్లె నియోజకవర్గం,సీటీఎం క్రాస్ రోడ్డు సమీపంలోని దయ్యాలవారిపల్లిలో అక్టోబర్ 17వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు మంగళవారం ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామస్తులు ఆహ్వానించారు.ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ గ్రామాలలో ఆలయాల నిర్మాణం,ఆలయాల మరమ్మతులతో ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతోందన్నారు.దయ్యాలవారిపల్లెలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం శు భసూచకమన్నారు.ఈ బృహత్తర కార్యక్రమానికి తప్పక హాజరవుతానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్ రెడ్డి,నాగార్జున రెడ్డి,దినకర్,వెంకటరమణ,నారాయణ,సురేష్,రఘునాథ్ రెడ్డి,సుబ్బారెడ్డి,కృష్ణ రెడ్డి,కిరణ్ కుమార్ రెడ్డి,చలపతి,గిరినాథ్ రెడ్డి మరియు గ్రామప్రజలు పాల్గొన్నారు.



# శ్రీచౌడేశ్వరి ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

## - వెండి కవచం అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**మదనపల్లె (ప్రజా సీమ)**



: పట్టణంలోని నీరుగట్టువారిపల్లె నందు వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో దసరా (శరన్నవరాత్రి) ఉత్సవాలు,30వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా మూడవ రోజైన శ్రీ చౌడేశ్వరి అమ్మవారు వెండికవచం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకము,తీర్థప్రసాద వినియోగము,అమ్మవారికి ప్రత్యేక అలంకరణ,మహా మంగళహారతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్,కమిటీ గౌరవ అధ్యక్షులు రామిశెట్టి నీలకంఠ,గౌరవ ఉపాధ్యక్షులతోపాటు కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య,కార్యదర్శి బండి పవన్ కుమార్ మాట్లాడుతూ చౌడేశ్వరి ఆలయంలో భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్స వాలు జరుగుతున్నాయన్నారు .విద్యుత్ దీపాలు,అనేక రకాల పుష్పాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించడం జరిగిందన్నారు.ఈ నెల 20వ తేదీ వరకు అమ్మవారు భక్తులకు వివిధ అలంకారాలలో దర్శనమిస్తారన్నారు.దాతల సహకారంతో ప్రతిరోజు భక్తులకు అల్పాహారం అందజేస్తున్నట్లు వారు తెలిపారు.శ్రీ చౌడేశ్వరి దేవి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా భక్తులు నవరాత్రి ఉత్సవాలకు పెద్దఎత్తున తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మోడెం వెంకటరమణ,శ్రీరామ్ చినబాబు,మోడెమ్ సిద్దప్ప,ఉప్పు రామచంద్ర,ఆర్.నీలకంఠ,బి.నాగరాజు,జి.లక్ష్మీనారాయణ,కె.వి నాగరాజు,ఆర్.కె మోహన,ఉప్పు శ్రీనివాసులు,ఆలయ కమిటీ సభ్యులు,తొగటవీర క్షత్రియ కుల బాంధవులు,భక్తులు పాల్గొన్నారు.

# బాక్సాఫీస్ వద్ద శ్రీ విష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' జోరు.. హిట్‌గా నిలిచిన కామెడీ డ్రామా!




వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటారు. ఆయన నటించిన తాజా కామెడీ డ్రామా 'కామ్రేడ్ కళ్యాణ్' తొలి వారాంతంలో మంచి వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. విడుదలైన తొలిరోజు నెమ్మదిగా ప్రారంభమైన ఈ సినిమా.. సాయంత్రం ఆటల నుంచి పుంజుకుంది. సినిమాకు సానుకూల స్పందన రావడంతో ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. దీంతో నాలుగు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ అయిందని మేకర్స్ పోస్టర్ ద్వారా తెలియజేశారు. దసరా సెలవులు కూడా కలిసి రావడంతో ఈ సినిమా సూపర్ హిట్ కావడం ఖాయమనే అంచనాకు వస్తున్నారు.శ్రీ విష్ణు సినిమాలంటేనే వినోదంతో పాటు విభిన్నమైన కథాంశాలు గుర్తుకొస్తాయి. ఈ క్రమంలో వచ్చిన 'కామ్రేడ్ కళ్యాణ్' కూడా ప్రేక్షకులను ఆకట్టుకునే కామెడీ డ్రామాగా నిలుస్తోంది. విడుదలైన మొదటి రోజు ప్రారంభంలో వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోయినప్పటికీ, సాయంత్రం ఆటల నుంచి పరిస్థితి మెరుగుపడింది. తొలి వారాంతంలో ఈ సినిమా తన జోరును కొనసాగించింది. సాధారణంగా కొత్త సినిమాలకు వారాంతంలో ప్రేక్షకుల ఆదరణ కీలకంగా ఉంటుంది. ఈ విషయంలో 'కామ్రేడ్ కళ్యాణ్'కు కలిసి రావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ప్రదర్శన కనబరిచినట్లు ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. చాలా సినిమాలకు సోమవారం నుంచి వసూళ్లు తగ్గడం సాధారణం. అయితే 'కామ్రేడ్ కళ్యాణ్' పనిదినాలలోనూ నిలకడను ప్రదర్శించింది. ఈ పరిణామంతో సినిమా హిట్ స్థాయికి చేరుకుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఈ చిత్రాన్ని కొనుగోలు చేసిన పంపిణీదారులు సేఫ్ సైడ్‌లో ఉన్నట్టు కథనాలు పేర్కొంటున్నాయి.అయితే, సినిమా సూపర్‌హిట్‌గా నిలుస్తుందా లేదా అనేది రాబోయే రోజుల్లో వసూళ్లు ఏ స్థాయిలో కొనసాగుతాయనే అంశంపై ఆధారపడి ఉంటుంది. దసరా సందర్భంగా కొత్త సినిమాలు థియేటర్లలోకి వస్తున్న నేపథ్యంలో 'కామ్రేడ్ కళ్యాణ్' వాటి పోటీని తట్టుకుని ఎంతకాలం నిలబడుతుందన్నది కీలకంగా మారింది. 'కామ్రేడ్ కళ్యాణ్'లో శ్రీ విష్ణు సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటించారు. జనకిరామ్ మరెళ్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సత్య, రాధిక, సుదర్శన్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, సాయిచంద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు.

# ఓటీటీ వివాదం.. ఆ మల్టీప్లెక్స్‌లలో 'జైలర్ 2' హిందీ వెర్షన్‌కు నో ఎంట్రీ!




సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్-ఇండియా చిత్రం 'జైలర్ 2' అక్టోబర్ 15న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అయితే రజనీకాంత్ నటిస్తున్న ఈ సినిమా హిందీ వెర్షన్ ఉత్తరాదిలో కొన్ని చోట్ల ప్రదర్శనకు నోచుకోవడం లేదు. ప్రముఖ మల్టీప్లెక్స్ చైన్‌లైన పీవీఆర్-ఐనాక్స్, సినీపోలిస్‌లలో ఈ చిత్ర హిందీ వెర్షన్ విడుదల కాకపోవడానికి ఓటీటీ వివాదమే ప్రధాన కారణమని తెలుస్తుంది. సినిమా థియేట్రికల్ విడుదలకు, ఓటీటీ స్ట్రీమింగ్‌కు మధ్య కనీసం ఎనిమిది వారాల గ్యాప్ ఉండాలని ఈ మల్టీప్లెక్స్ సంస్థలు పట్టుబడుతున్నాయి. అయితే, నిర్మాత సన్ పిక్చర్స్, డిస్ట్రిబ్యూటర్ పెన్ మరుధర్ ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రం అన్ని భాషలకు కేవలం నాలుగు వారాల విండో మాత్రమే ఉండాలని కోరుకుంటున్నాయి. ఈ వాగ్వాదం కారణంగానే ఒప్పందాలపై సందిగ్ధత నెలకొని, ఉత్తరాదిలోని పీవీఆర్-ఐనాక్స్ మరియు సినీపోలిస్‌లలో హిందీ వెర్షన్ ప్రదర్శనలను రద్దు చేసుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి.అయితే ఈ వివాదం కేవలం హిందీ వెర్షన్‌కే పరిమితం కాగా, నవంబర్ నెలలో దీపావళి కానుకగా ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో అన్ని భాషల్లో ఓటీటీ ప్రీమియర్ కానుందని సమాచారం. ఉత్తరాదిలో ఈ మల్టీప్లెక్స్ చైన్‌లు కాకుండా కేవలం సింగిల్ స్క్రీన్‌లు, ఇతర స్టాండర్డ్ థియేటర్లలో మాత్రమే హిందీ వెర్షన్ ప్రదర్శితం కానుంది. ఈ భారీ చిత్రంలో హృతిక్ రోషన్, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, విజయ్ సేతుపతి, ఎస్.జె. సూర్య తదితరులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు.

# 'రామాయణం'లో జటాయువుగా అనుపమ్ ఖేర్!

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణం' నుండి ఒక కీలకమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ చిత్రంలో ధైర్యానికి, ధర్మానికి ప్రతీక అయిన 'జటాయువు' పాత్రకు ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ తన గాత్రాన్ని (వాయిస్ ఓవర్) అందిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు చిత్ర బృందం జటాయువు పాత్రకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. రావణాసురుడు సీతాదేవిని అపహరించుకుపోతున్న సమయంలో, ఆమెను రక్షించడానికి జటాయువు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడిన చారిత్రక ఘట్టం రామాయణంలో అత్యంత భావోద్వేగమైనది. ఈ శక్తివంతమైన పాత్రకు అనుపమ్ ఖేర్ వాయిస్ ఓవర్ సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.ఇదిలా ఉండగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 5, 2026 న థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ రావణాసురుడిగా మరియు సన్నీ డియోల్ హనుమంతుడి పాత్రలలో నటిస్తున్నారు. సినిమాపై అంచనాలు భారీగా ఉండగా, దీనికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ అక్టోబర్ 20వ తేదీన దసరా పండుగ సందర్భంగా ప్రారంభం కానున్నాయి.




# డిసెంబర్ 4న విజయ్ సేతుపతి 'ట్రైన్'.. నితిన్, నాగచైతన్య సినిమాలకు గట్టి పోటీ!




తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ట్రైన్' విడుదల తేదీ ఖరారైంది. చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఈ సినిమాను 2026 డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని విజయ్ సేతుపతి సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. విడుదల తేదీతో పాటు కొత్త పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. డిసెంబర్ మొదటి వారంలో ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' విడుదలవుతుందని అభిమానులు ఆశించినప్పటికీ, ఆ సినిమా వాయిదా పడినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో డిసెంబర్ 4న పలు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. నితిన్ నటించిన 'అలియాస్ రుక్మిణి', నాగచైతన్య ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'వృషకర్మ', విశ్వక్ సేన్ నటిస్తున్న 'లెగసీ' చిత్రాలు అదే తేదీన విడుదల కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు విజయ్ సేతుపతి 'ట్రైన్' కూడా అదే రోజున విడుదలకు సిద్ధమవడంతో బాక్సాఫీస్ వద్ద పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. విజయ్ సేతుపతికి తమిళంతో పాటు తెలుగులోనూ అభిమానులు ఉండటంతో, ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల ముందుకు కూడా వస్తే ఇతర చిత్రాలకు పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, అన్ని సినిమాల విడుదల తేదీలపై ఆయా చిత్ర బృందాల తాజా అధికారిక ప్రకటనలను బట్టి పూర్తి స్పష్టత రానుంది.'ట్రైన్' సినిమాకు దర్శకుడు మిస్కిన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి ఆయనే సంగీతాన్ని కూడా అందిస్తున్నారు. వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి ఎస్. థాను నిర్మిస్తున్నారు.

# ప్రభాస్ 'కల్కి 2' మూవీకి సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్.. షూటింగ్ అప్‌డేట్!



పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక సిక్వెల్ చిత్రం 'కల్కి 2'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ప్రభాస్ ఇతర సినిమాల కమిట్‌మెంట్ల కారణంగా ఈ ప్రాజెక్ట్ షూటింగ్ కొద్దిగా నెమ్మదిగా సాగుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ చిత్రంలో కీలకమైన పాత్ర కోసం ప్రముఖ నటి సాయి పల్లవి ఎంపికైన విషయం తెలిసిందే. వాస్తవానికి ఆమె ఈ అక్టోబర్ నెలలోనే సినిమా షూటింగ్ సెట్స్‌లో జాయిన్ కావాల్సి ఉండగా, మేకర్స్ ప్లాన్‌లో స్వల్ప మార్పులు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం సాయి పల్లవి తాను నటిస్తున్న 'రామాయణం' సినిమా ప్రమోషన్లు మరియు ఇతర కార్యక్రమాలపై పూర్తి దృష్టి పెట్టారు. ఈ పవిత్ర పౌరాణిక చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, ఆ సినిమా రిలీజ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆమె 'కల్కి 2' షూటింగ్ షెడ్యూల్‌లో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక క్లారిటీ రానుంది.

# శంబాల హిట్.. మరో మిస్టిక్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు ఆది సాయికుమార్!

డైలాగ్ కింగ్ సాయికుమార్ తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆది సాయికుమార్, కెరీర్ మొదట్లో కొన్ని లవ్ స్టోరీలతో విజయాలను అందుకున్నారు. అయితే ఆ తర్వాత కొన్నాళ్లపాటు ఆయనకు సరైన హిట్లు పడలేదు. దీంతో రూట్ మార్చిన ఆయన, గత ఏడాది 'శంబాల' అనే మిస్టిక్ థ్రిల్లర్‌తో వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సక్సెస్ ఆయన కెరీర్‌కు మంచి బూస్ట్ ఇవ్వడంతో పాటు, అభిమానుల్లో కొత్త జోష్ నింపింది.ఈ విజయం ఇచ్చిన ఊపుతో ఆది సాయికుమార్ మరోసారి అలాంటి జానర్‌లోనే సినిమా చేయడానికి సిద్ధమయ్యారు. త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రశాంత్ జి రుద్రప్ప ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా. 'నవరసన్' దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ అప్‌డేట్‌ను దసరా కానుకగా విడుదల చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఇక విడుదలైన కొత్త పోస్టర్‌లో దట్టమైన అడవి మధ్యలో ఉన్న పురాతన పూజా ప్రదేశం, వెలుగుతున్న నూనె దీపం, త్రిశూలాన్ని చుట్టుకుని పడగ విప్పిన పాము వంటి విజువల్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో ఒక శక్తివంతమైన దైవ రహస్యం, ఊహించని ట్విస్టులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. మరో విశేషం ఏమిటంటే, 'కాంతార' ఫేమ్ అంజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రేక్షకులను సీట్లలో కదలకుండా కూర్చోబెట్టేలా అదిరిపోయే స్క్రీన్ ప్లేతో రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma